క్లుప్తంగా

త్వరితగతిన ఇంటి పన్నులు చెల్లించండి

కమిషనర్ అన్నదాత మోహన్ శ్రీనివాసరావు

గురజాల : త్వరితగతిన ఇంటి పన్నులు చెల్లించాలని నగర పంచాయతీ కమిషనర్ అన్నదాత మోహన్ శ్రీనివాసరావు సూచించారు. ఆయన తన కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల చివరిలోగా శత శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలన్నారు. అదే విధంగా గ్రామాల్లో పారిశుద్ధ్య పనుల నిర్వహణ, తాగునీటి సరఫరా ,విద్యుత్ దీపాలు పనితీరు ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్లు తెలిపారు. ఎవరికి వారు స్వచ్ఛందంగా కార్యాలయానికి వచ్చి ఇంటి పన్నులు చెల్లించాలన్నారు.

నేడు ప్రభుత్వ విప్ పీఆర్కే రెంటచింతల రాక

రెంటచింతల: ఫ్రెండ్స్ ఇన్ నీడ్ పౌండేషన్ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రమైన రెంటచింతలలో హెపటైటీస్ బి అండ్ సిపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు డీసీఎంఎస్ డైరెక్టర్, పౌండేషన్ గౌరవ అధ్యక్షులు మద్దిరాల కృష్ణారెడ్డి తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ నాయకులు శ్యామల రవికిశోర్‌రెడ్డి పూర్తి సహకారంతో స్థానిక యూనియన్ బ్యాంక్(ఆంధ్రబ్యాంక్) వద్ద ఆదివారం ఉదయం 10గం.లకు ఏర్పాటు చేస్తున్న ఈ అవగాహన కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి చేతులమీదుగా ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకుని రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

నేడు బొడ్రాయి వార్షికోత్సవం

దుర్గి: మండల పరిధిలోని కంచరగుంట గ్రామంలో స్థానిక గ్రామ నడిబొడ్డులో ప్రతిష్ఠించిన బొడ్డురాయి, సీతాలమ్మల 11వ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు, గ్రామస్తులు సీతాలమ్మను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలన్నారు. మధ్యాహ్నం మహాఅన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. చుట్టు పక్కల గ్రామస్తులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

రేపు 31వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం

పిడుగురాళ్ల: పట్టణంలోని 31వ వార్డులో ఈ నెల 13వ తేదీన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ చింతా వెంకటరామారావు శనివారం తెలిపారు. ఈ కార్యక్రమానికి గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై వార్డు ప్రజలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలకు ఇప్పటి వరకు అందించిన సంక్షేమ పథకాలు తెలుపుతూ స్థానిక సమస్యలు తెలుసుకుని పరిష్కరించే దిశగా కార్యక్రమం జరుగుతుందని చింతా వెంకటరామారావు పేర్కొన్నారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని తెలిపారు.

తారురోడ్డుకు మరమ్మతులు



దాచేపల్లి : దాచేపల్లి-గోగులపాడు రోడ్డుకు ఆర్‌అండ్‌బీ అధికారులు మరమ్మతులు చేపట్టారు. ఈ రోడ్డులో గుంతలు ఏర్పడడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. దీంతో రోడ్డుకు మరమ్మతులు చేయించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిని కోరారు. దీంతో ఆర్‌అండ్‌బీ అధికారులతో ఎమ్మెల్యే కాసు మాట్లాడి యుద్ధప్రతిపాదికన రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని సూచించారు. ఈ నేపథ్యంలో సూమారుగా 5 కిలోమీటర్ల పరిధిలో పలు చోట్ల ఏర్పడిన గుంతలను తారుతో పూడ్చి వేస్తున్నారు. ఈ పనులను ఆర్‌అండ్‌బీ ఏఈ సీరజ, కాంట్రాక్టర్లు కిష్టిపాటి అంకిరెడ్డి, బొడ్డు నాగేశ్వరరావు పర్యవేక్షిస్తున్నారు.

తెలుగు రాష్ట్రాల స్థాయిలో ఏక పాత్రాభినయ పోటీలు

దుర్గి: ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు కన్నెగంటి హనుమంతు 101వ వర్ధంతి సందర్భంగా ఈ నెల 22వ తేదీన స్థానిక వేణుగోపాల స్వామి కల్యాణమండపంలో పోటీలు నిర్వహిస్తున్నట్లు కన్నెగంటి సేవా సంఘం ప్రతినిధులు ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలను పౌరాణికం, చారిత్రిక, సాంఘీక విభాగాల్లో ఏకపాత్రాభినయం పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో జరిగే ఈ పోటీల్లో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి పాల్గొనాలని కళాకారులను ఆహ్వానించారు. మొదటి బహుమతిగా రూ. 8వేల నగదు, ద్వితీయ బహుమతి రూ. 6వేలు, మూడవ బహుమతి 4వేలు అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన కళాకారులు మరిన్ని వివరాలకు : 8374735298, 9912357318లను సంప్రదించాలన్నారు.

గ్రామ స్వరాజ్యం జగనన్నతోనే సాధ్యం

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

దుర్గి: గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో సాధ్యమౌతుందని పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని అడిగొప్పలలో రూ. 79 లక్షలతో నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల ముంగిటకు పౌర సేవలను అందించడం కోసం సీఎం జగన్ చేపట్టిన మహోన్నత కార్యక్రమమన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయనటువంటి అభివృద్ధి కార్యక్రమాలను మన వైఎస్సార్ సీపీ చేపట్టిందన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి సుమారు 500లకు పైగా సేవలు ఇంటి వద్దకే తీసుకొచ్చారన్నారు. రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, యంత్రాలు అందజేస్తోందన్నారు. ఉచితంగా పంటల ఇన్సూరెన్సు కల్పించిందన్నారు. రైతులకు మద్దతుగా నిలిచిన ప్రభుత్వం వైఎస్సార్ సీపీనే అన్నారు. ఆరోగ్య సేవలోనే దేశంలో మన రాష్ట్రం ప్రప్రథమంగా నిలిచిందన్నారు. ఏడవ రోజు కొనసాగిన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం గత కొన్ని రోజులుగా నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం శనివారం రాత్రి నిరంతరాయంగా కొనసాగింది. మహిళలు, యువకులు, గ్రామస్తులు, నాయకులు ఉత్సాహంగా పాల్గొని ప్రభుత్వ విప్ పీఆర్కేకు స్వాగతం పలికారు. ఆయన ప్రతి గడపకు వెళ్లి లబ్ధిదారులు పొందిన లబ్ధిని వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నాలి రామయ్య, మార్కెట్ యార్డు చైర్మన్ వెలిదండి గోపాల్, ఎంపీపీ యేచూరి సునీత సాయి శంకర్, వైస్ ఎంపీపీ చల్లా శ్రీనివాసరావు, ఊరిబండి ఏగయ్య, పంచాయితీరాజ్ ఎఈ నాగిరెడ్డి వెలిగొండారెడ్డి, ఎంపీటీసీ షేక్ హుస్సేన్, నాయకులు నల్లబోతు వెంకటేశ్వర్లు, పార్టీ కన్వీనర్ ఉన్నం పెద్దబ్బాయి, నాలి శ్రీను, సంక్రాంతి గురువులు, కొనకంచి బాబు, జంగా యలమంద, గర్ని లక్ష్మినారాయణ, కటకం చిన్న వెంకటయ్య, తోట వాసు, షేక్ నాగుల్ మీరా, నాగెండ్ల లక్ష్మినారాయణ, రాయల మధు, షేక్ జానీ, వేముల సత్యనారాయణ, దుర్గి ఎంపీటీసీ కటకం గోపాల్, గుండాల వెంకటరామయ్య, శెట్టిపల్లి కోటేశ్వరరావు, మాచర్ల జార్జి, మక్కెన వెంకటేశ్వర్లు, జక్కా రమేష్, మండల అధికారులు, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, నాయకులు, , కార్యకర్తలు, అభిమానులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

నవరత్నాలతో ప్రతి గడపకూ సంక్షేమం

గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



లబ్ధిదారులకు పథకాల వివరాలను తెలియజేస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

మాచవరం: ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని తుచ తప్పకుండా నేరవేరుస్తూ, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనని గురజాల శాసన సభ్యులు కాసు మహేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని తురకపాలెం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ముందుగా నూతనంగా నిర్మించిన వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవరత్నాల పథకాల ద్వారా గ్రామంలో సుమారు రూ.7.5 కోట్లు అందిస్తున్నట్లు చెప్పారు. గ్రామంలో ఉన్న సుమారు 400 కుటుంబాలకు గానూ ఒక్కో కుటుంబానికి రూ.1 లక్ష నుంచి రూ.లక్షన్నర వరకు లబ్ధి చేకూరిందన్నారు. రూ.70 లక్షలతో అంతర్గత సీసీ రోడ్లు నిర్మాణం పూర్తి చేసామన్నారు. రూ.40 లక్షల జేజేఎం నిధులతో ప్రతి ఇంటికి మంచినీటి కుళాయి ఏర్పాటుకు పనులు జరుగుతున్నాయని, త్వరలో పనులు పూర్తి చేసి పల్నాడు జిల్లాలోనే మొదటిగా గ్రామీణ ప్రాంతంలో ప్రతి ఇంటికి మంచి నీటిని అందించిన గ్రామంగా తీర్చిదిద్దుతామన్నారు. గ్రామంలో ఎన్నడూ లేని విధంగా సుమారు రూ. 70 లక్షలతో ప్రభుత్వ గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లినిక్ సెంటర్ నిర్మించినట్లు చెప్పారు. ఇళ్లులేని పేదలకు 40 మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేయగా, మరో 89 మందికి గృహ నిర్మాణ పథకం ద్వారా ఇళ్లు నిర్మాణంలో ఉన్నట్లు తెలియజేసారు. నాడు- నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాల్లో మౌలిక సదుపాయలలు కల్పనకు, నూతన భవన నిర్మాణాలు, విద్యార్థుల విద్యా బోధనకు అవసరమైన సామాగ్రి అందించినట్లు తెలిపారు. షా. దీఖానా, మదర్సాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. నాలుగేళ్లలో గ్రామంలో ఎన్నడూ లేని విధంగా సుమారు రూ.12 కోట్లతో పనులు చేపట్టినట్లు తెలిపారు. కొందరు స్వార్ధంతో గ్రామ ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతున్నారని, టీడీపీ అల్లరి మూకలు గొడవలు సృష్టిస్తే ఊరుకునే ప్రశక్తే లేదన్నారు. గ్రామంలో శాంతిని నెలకొల్పేందుకు ముస్లిం సోదరులు అందరు కలిసి రావాలని, గ్రామాభివృద్ధికి సహకరిస్తూ, ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు అందరు కృషి చేయాలని కోరారు. అనంతరం గ్రామంలో ప్రతి ఇంటిని దర్శించి ఆయా కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా అందించిన లబ్ధిని వివరిస్తూ బోర్డ్లను అందజేశారు. కార్యక్రమంలో ఏపీ సర్పంచుల సంక్షేమ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, గ్రామ సర్పంచ్ షేక్ అల్లాభక్షు, ఎంపీడీఓ వై.రాజగోపాల్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సురేష్, పీఆర్ ఏఈ వెంకటేశ్వరరెడ్డి, ఈఓఆర్డీ వెంగళరావు, మండల కన్వీనర్ సింగరయ్య, జడ్పీటీసీ శివాయాదవ్, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లచ్చిరెడ్డి , వైస్ ఎంపీపీలు చింతపల్లి నన్నే, సచివాలయ కన్వీనర్లు షేక్ రఫీ, దస్తగిరి, ఆప్టికల్ బాషా,అమీర్, మీరాభి, మండల నాయకులు ఆవుల నరసింహారెడ్డి, అనిల్ కుమార్, పలు శాఖల ప్రభుత్వ అధికారులు,వలంటీర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని సత్కరిస్తున్న కళాశాల సిబ్బంది

మాచర్ల : రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి విశేష కృషి చేస్తూ ఆంధ్రప్రదేశ్‌ను విద్యాపరంగా అగ్ర భాగాన నిలిపేందుకు నిరంతరం తపన పడుతున్నారని పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం స్థానిక నరిశెట్టి కల్యాణ మండపంలో జరిగిన కృష్ణవేణి జూనియర్ కళాశాల వార్షికోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో చదువులో ప్రతి ఒక్క పేద విద్యార్థి నుంచి అందరూ ముందంజలో ఉండాలని అమ్మ ఒడి, విద్యాదీవెన, విద్యావసతి, మధ్యాహ్న భోజన పథకంతోపాటు అనేక కార్యక్రమాలు చేపట్టి ట్యాబ్‌లను సైతం అందజేశారని పిఆర్కే తెలిపారు. విద్యకు సంబంధించి వేల కోట్ల రూపాయలు లక్షలాది మంది విద్యార్థులకు కేటాయిస్తూ ప్రతి ఒక్కరూ ఉన్నత స్థాయికి చేరుకోవాలనే లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేయడం జరుగుతుందన్నారు. ఇటువంటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రతి ఒక్కరూ విద్యాపరంగా ఉన్నతస్థాయికి వెళ్లాలని ఆయన ఆకాంక్షించారు. ఈ వార్షికోత్సవ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, న్యాయవాది శ్రీనివాసశర్మ, కృష్ణవేణి కళాశాల ప్రిన్సిపల్ వై.వెంకటరామయ్య, డైరెక్టర్లు వి.శ్రీనివాసరావు, సిహెచ్ శ్రీనివాసరావు, డి.సుబ్బారావు, లక్ష్మయ్యలతోపాటు పలు విద్యాసంస్థల ప్రిన్సిపాళ్లు, డైరెక్టర్లు, వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పల్నాడులో విద్యాభివృద్ధికి విశేష కృషి జరుపుతున్న ప్రభుత్వ విప్ పీఆర్కేకు ఘనస్వాగతం చెప్పి సత్కరించారు.

వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కన్వీనర్ల ఎంపిక

దుర్గి: రాష్ట్ర ప్రభుత్వం అమలుపరుస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్ళేందుకు పార్టీ అధిష్టానం సోషల్ మీడియా కమిటీని ఏర్పాటు చేసింది. దీనిలో భాగంగా మండలానికి చెందిన కుప్పాల శివకేశవరెడ్డిని మండల సోషల్ మీడియా కన్వీనర్‌గా, కో కన్వీనర్లుగా పసుపులేటి సాయిశంకర్, షేక్ సైదా, బి ప్రతాప్‌రెడ్డి, బి అశోక్‌రెడ్డిలను నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియామకానికి సహకరించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

సోషల్ మీడియా మండల కన్వీనర్‌గా శ్రీనివాసరావు

దాచేపల్లి : వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా మండల కన్వీనర్‌గా దాచేపల్లికి చెందిన అక్కినపల్లి శ్రీనివాసరావు నియమితులయ్యారు. కో కన్వీనర్లుగా షేక్ బాజీ, సీహెచ్. వెంకటగురవయ్య, భీమవరపు గోపీకృష్ణ, బండ్ల అఖిల్ నియమితులయ్యారు. కన్వీనర్, కో కన్వీనర్లను ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు కోట కృష్ణా, షేక్ సుభానీ, నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, ఎంపీపీ కటకం జయశ్రీ తదితరులు అభినందించారు.

మండల సోషల్ మీడియా కన్వీనర్‌గా జక్కిరెడ్డి

కారెంపూడి: వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా విభాగం కారెంపూడి మండల కన్వీనర్‌గా జక్కిరెడ్డి నాగిరెడ్డి నియమితులయ్యారు. అలాగే కో కన్వీనర్లుగా సయ్యద్ ఫరీద్‌బాబా, కందుకూరి సాగర్‌బాబు, పిన్నెల్లి శ్రీనివాసరావు, అన్నపరెడ్డి పవన్‌కుమార్ రెడ్డిలను నియమిస్తూ శనివారం ఉత్తర్వులు వెలువడ్డాయి.

ఒప్పిచర్ల తిరునాళ్లలో ప్రభుత్వ విప్ పీఆర్కే

కారెంపూడి: మండలంలోని ఒప్పిచర్ల గ్రామంలో శనివారం జరిగిన శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వాముల వారి తిరునాళ్లలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. వీరబ్రహ్మేంద్రస్వాములవారికి ప్రభుత్వ విప్ పీఆర్కే ప్రత్యేక పూజలు చేశారు. అలాగే శివపార్వతులకు పూజలు చేశారు. మఠం పీఠాధిపతి వీరబ్రహ్మచారి, పూజారులు, గ్రామ పెద్దలు ప్రభుత్వ విప్ పీఆర్కేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీపీ మేకల శారదాశ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ షేక్ షఫీ, మాజీ ఎంపీపీ పంగులూరి చినవెంకటనర్సయ్య, సర్పంచ్ ఇరికెదిండ్ల రమణకొండలు, మాజీ సర్పంచ్ రామదేని ఆంజనేయులు, మండల, కారెంపూడి పట్టణ పార్టీ అధ్యక్షుడు సుబ్రమణ్యం, బొమ్మిన అల్లయ్య, పంగులూరి రామక్రిష్ణయ్య, మందాళ్ల అంజిరెడ్డి, మండల గ్రామ సచివాలయాల కన్వీనర్ అల్లు వెంకటేశ్వరరెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

మరమ్మతు పనులు

మాచర్ల: విద్యుత్‌శాఖ డివిజనల్ కార్యాలయ పరిధిలో వివిధ సబ్‌స్టేషన్ల పరిదిలో మరమ్మతుల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేసి 132 కేవీ లైన్ సబ్‌స్టేషన్ మరమ్మతు పనులు నిర్వహించారు. మాచర్ల డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జె.హరిబాబు, డీఇ ఏ.రామయ్య ఆధ్వర్యంలో సిబ్బంది మరమ్మతు పనులు చేపట్టారు. ఉదయం 9.30 నుంచి సాయంత్రం వరకు మరమ్మతు పనులు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

కరుణామయురాలు లూర్ధుమాత

గురువులు రె.ఫాదర్ ఏరువ లూర్థుమర్రెడ్డి



ప్రార్ధనలు చేస్తున్న చేస్తున్న పాస్టర్లు

రెంటచింతల: కరుణ, దయకలిగిన తల్లిగా భక్తులచే కొనియాడబడుతున్న లూర్థుమాతను ప్రార్థిస్తే తప్పక ఆ కుటుంబంలో సుఖసంతోషాలు వెల్లువిరిస్తాయని కానుకమాత చర్చి విచారణ గురువులు రె.ఫాదర్ ఏరువ లూర్థుమర్రెడ్డి అన్నారు. స్థానిక లూర్ధుమాత మందిరం 104వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని లూర్ధుమాత పండుగ సందర్భంగా శనివారం రాత్రి నిర్వహించిన సమిష్టి దివ్యపూజాబలిలో భక్తులను ఉద్దేశించి ఫాదర్ లూర్థుమర్రెడ్డి మాట్లాడారు. నా ఆత్మ ప్రభువు కోసం స్తుతించుచున్నది అని ఆ తల్లి లూర్ధుమాత చెప్పిన వాక్యంలో ఎంతో అర్థం దాగి ఉందన్నారు. భక్తులకు దర్శనమిచ్చిన లూర్ధుమాత ప్రపంచశాంతి కోసం ప్రార్ధించాలని, పాపపు జీవితాలను విడనాడి దేవుని సూక్తులను ఆచరించి త్యాగపూరితమైన జీవితాన్ని జీవించాలన్నారు. ప్రతి ఒక్కరు మంచి జీవితంకోసం జపమాలమాతగా దర్శణమిచ్చిన లూర్ధుమాతను ప్రార్థించాలన్నారు. మందిరాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు.

లూర్దుమాత తిరునాళ్ల మహోత్సవాలు

మాచర్ల రూరల్: లూర్దుమాత 117వ తిరునాళ్ల మహోత్సవాలను ఘనంగా నిర్వహించాలని గుంటూరు మేత్రాశునులు, కోశాధికారి యేరువ బాలశౌరెడ్డి శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ మరియమాత దీవెనలు అందాలని, మన పాపములు విడిచి ఆ తల్లి వలె విశ్వాసం తో క్రీస్తు మార్గం లో నడవాలన్నారు.

చీటీ పాటల వ్యవహారంతో సంబంధంలేదు

దాచేపల్లి : దాచేపల్లికి చెందిన బుర్రి వెంకటనర్సమ్మ నిర్వహించే చీటి పాటలతో తనకు సంబంధంలేదని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కోట కృష్ణ అన్నారు. మండలంలోని కేసానుపల్లిలోని ఆయన స్వగృహంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వెంకటనర్సమ్మ తనకు మేనకోడలు వరుస అవుతుందని, అంతమాత్రనా తనపై అసత్యాలను కావాలనే జనసేనతో పాటు పలువురు అసత్యాలు ప్రచారం చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత 15ఏళ్ల నుంచి వెంకటనర్సమ్మ చీటిపాటలు నిర్వహిస్తోందని, చీటిపాటలలో సభ్యులుగా ఉన్న వారు తనకు చెప్పి కట్టలేదన్నారు. వెంకటనర్సమ్మ చీటి పాటలో ఉన్న వారికి డబ్బులు ఇవ్వాల్సి ఉంటే ఆమె ఆస్తి అమ్మి ఇచ్చిన తనకేలాంటి సంబంధంలేదని కన్వీనర్ కృష్ణ చెప్పారు. కొంతమంది కావాలనే తనపై, వైఎస్సార్ సీపీపై బురదజల్లే కుట్ర చేస్తున్నారని ఆయన అన్నారు.

ఆలయ వార్షికోత్సవ పోస్టర్లు ఆవిష్కరణ

రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలోని అతి పురాతనమైన శ్రీ రుక్మిణీ సత్యభామా సమేత శ్రీ వేణుగోపాల స్వామి వారి ఆలయ వార్షికమహోత్సవాన్ని ఈ నెల 14న భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిపించాలని ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం మాచర్ల పట్టణంలోని ఎమ్మెల్యే వారి కార్యాలయంలో ఆలయ వార్షికప్రతులను ప్రభుత్వ విప్ పీఆర్కే ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. వార్షికోత్సవ వేడుకలను కనుల పండుగగా జరిపించేందుకు కమిటీ వారికి శ్రీ కృష్ణభగవానుడు చల్లని దీవెనలు అంధించాలని కోరారు. కార్యక్రమంలో రెంటచింతల సొసైటీ చైర్మన్ మోదుగు శ్రీనివాసరెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు గొట్టిపాళ్ల కృష్ణమాచార్యులు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన నాయకులు మోర్త ఉమ, పమ్మి సీతారామిరెడ్డి, యేచూరి కొండలు, నాళం చినబాబు తదితరులున్నారు.

లోక్‌అదాలత్ సేవలను సద్వినియోగం చేసుకోండి

సివిల్ జడ్జి మధుబాబు, శారదాదేవి



కేసులు పరిష్కరిస్తున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మధుబాబు, అదనపు జడ్జి శారదాదేవి

మాచర్ల: దేశవ్యాప్తంగా వివిధ పెండింగ్ కేసులను పరిష్కరించి కక్షిదారులకు ఇబ్బంది లేకుండా సత్వరమే చర్యలు తీసుకునేందుకే లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని మాచర్ల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ మధుబాబు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి శారదాదేవిలు అన్నారు. మండల న్యాయ సేవా కమిటీ ఆధ్వర్యంలో శనివారం కోర్టు ప్రాంగణంలో లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించి 300 కేసులను పరిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు కక్షిదారులనుద్దేశించి మాట్లాడుతూ రాజీచేయదగ్గ ప్రతి కేసును జాతీయ లోక్‌అదాలత్‌లో పరిష్కరించడం జరుగుతుందన్నారు. మాచర్ల కోర్టు పరిధిలోని 23 సివిల్, 56 క్రిమినల్ కేసులు, 5 చెక్ బౌన్స్, 3 భరణం కేసులు, నేరం అంగీకరించిన 203 కేసులు, ముందస్తు రాజీపడిన 10 కేసులను పరిష్కరించారు. కార్యక్రమంలో లోక్‌అదాలత్ సభ్యులు మెట్టు గోవిందరెడ్డి, షేక్ గౌస్‌బాషా, న్యాయవాది రమావత్ రామ్‌నాయక్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు జూపల్లి శ్రీనివాసరావు, సీనియర్ న్యాయవాదులు సీహెచ్ నాగిరెడ్డి, గట్ల సత్యనారాయణరెడ్డి, బాలజోజి, గంగుల శ్రీనివాసరావు, పేర్ల వెంకటేశ్వర్లు, కోర్టు గుమస్తాలు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

గురజాల : స్థానిక కోర్టు భవనంలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 252 కేసులు పరిష్కారమైనట్లు మండల న్యాయ సేవాధికార సంస్థ, పదవ అదనపు జిల్లా జడ్జి జి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్‌అదాలత్ ద్వారా కేసులు పరిష్కరించుకుంటే కక్షిదారులకు సమయంతో పాటు డబ్బులు కూడా ఆదా చేసుకోవచ్చన్నారు. పరిష్కారానికి వీలు కలిగిన కేసులు లోక్ అదాలత్ ద్వారా రాజీ చేసుకోవాలన్నారు. శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో సివిల్ 12, క్రిమినల్ 234, వివాహ సంబంధిత కేసులు 5, చెక్ బౌన్సు 1 కేసు పరిష్కరించినట్లు ఈ కేసులకు సంబంధించి లక్షల్లో రూ.61,82,862/-లు కక్షిదారులకు అందించినట్లు తెలిపారు. ఈ అదాలత్‌లో సీనియర్‌సివిల్ జడ్జి బి లీలా వెంకట శేషాద్రి, జూనియర్ సివిల్ జడ్జి ఏ మంజులతా, న్యాయవాదులు కొంగర హరిసత్యనారాయణ, ఆచంట శ్రీనివాసరావు, జక్కా చెన్నకేశవరావులు వ్యవహరించారు. లోక్ అదాలత్‌కు హాజరైన కక్షిదారులకు మధ్యాహ్నం పులిహోరా అందించారు.

తాగునీటికి రూ. 14.33 కోట్లు మంజూరు

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి : ప్రతి ఇంటికి తాగునీరు అందించేందుకు రూ. 14.33 కోట్ల నిధులు మంజూరు అయ్యాయని గురజాల శాసనసభ్యుడు కాసు మహేష్‌రెడ్డి తెలిపారు. నారాయణపురం ఆర్‌అండ్‌బీ బంగ్లాలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పొందుగల రూ.47.40 లక్షలు, శ్రీనివాసపురం రూ.42.78 లక్షలు, శ్రీనగర్ రూ.21.45 లక్షలు, భట్రుపాలెం రూ. 149.90 కోట్లు, కాట్రపాడు రూ.45.30 లక్షలు, గామాలపాడు రూ. 148.10 కోట్లు, శంకరపురం రూ. 15 లక్షలు, తంగెడ రూ 1.10 కోట్లు, ముత్యాలంపాడు రూ. 1.18 కోట్లు, తక్కెళ్లపాడు రూ. 60.88 లక్షలు, పెదగార్లపాడు రూ. 1.75కోట్లు, రామాపురం రూ. 38 లక్షలు, కేసానుపల్లి రూ 1.30 కోట్లు, సారంగపల్లి అగ్రహారం రూ 57.93 లక్షలు, కొత్తూరు రూ. 69.70 లక్షలు, మాదినపాడు రూ 1.61కోట్లు చొప్పున నిధులు మంజూరైనట్లు ఆయన వెల్లడించారు. జల జీవన్ మిషన్ ద్వారా మంజూరైన ఈ నిధులతో ప్రతి ఇంటికి కృష్ణానది నీటిని అందించేలా చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఏడాది కాలం వ్యవధిలో టెండర్లు పూర్తి పనులు ప్రారంభించి మరో 100 ఏళ్లపాటు ప్రజలు మంచినీటి కోసం ఇబ్బందులు పడకుండా చేయలన్నదే తన తపన అని ఎమ్మెల్యే కాసు అన్నారు. గత 70 ఏళ్ల నుంచి ఫ్లోరైడ్ ఉన్న నీటిని తాగుతున్నారని, ఫ్లోరైడ్ నుంచి ప్రజలను కాపాడేందుకు శుద్ధి చేసిన కృష్ణా జలాలను ప్రజలకు అందించేందుకు పని చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. నగర పంచాయతీ చైర్మన్ సాంబయ్య, మాజీ చైర్మన్ పున్నారావు, వైస్ చైర్మన్ షేక ఖాదర్‌భాషా, మాజీ సర్పంచ్ మందపాటి రమేష్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కందుల జాను, పార్టీ మాజీ మండల కన్వీనర్ షేక్ జాకీర్ హుస్సేన్, నాయకులు పాల్గొన్నారు.

నేడు జాతీయస్థాయి బండలాగు ఎడ్లపోటీలు



సత్రశాలలో సిద్ధమైన గరిడి(మైదానం)



సమావేశంలో మాట్లాడుతున్న సత్రం అధ్యక్షులు పులి ఓబుల్‌రెడ్డి, కమిటీ సభ్యులు

సత్రశాల(రెంటచింతల): మండలంలోని సత్రశాలలో వేంచేసిన ప్రముఖ శైవక్షేత్రమైన శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లిఖార్జున దేవస్థానం సమీపంలోని శ్రీ శివభక్త కుంటి మల్లారెడ్డి అన్నదాన సత్రంలో మహాశివరాత్రి తిరుణాళ్ల సందర్భంగా ఆదివారం నుంచి జాతీయస్థాయిలో నిర్వహించే ఒంగోలు జాతి ఎద్దుల బండలాగు ప్రదర్శన పోటీలకు సత్రశాల సర్వం సిద్ధమైనట్లు అన్నదాన సత్రం అధ్యక్షులు, కమిటీ సభ్యులు పులి ఓబుల్‌రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని పాలువాయి జంక్షన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆశీస్సులతో వైఎస్సార్ సీపీ యువజన ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామి రెడ్డిల ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఒక్కొక్క విభాగంలో 6 నుంచి 8 బహుమతులు చొప్పున మొత్తం 41 బహుమతుల ద్వారా రైతు సోదరులకు రూ.10.17 లక్షలు అందచేయనున్నట్లు వెల్లడించారు. ఫిబ్రవరి 12న 2 పళ్ళ విభాగం, 13న 4 పళ్ళ విభాగం, 14న సీనియర్స్ విభాగంలో పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. 15న జూనియర్ విభాగం, 16న 6 పళ్ళ విభాగం, 17న న్యూకేటగిరి విభాగంలో పోటీలు నిర్వహించడం జరుగుతాయ న్నారు. 2 పళ్ళ విభాగానికి 10 నిమిషాలు, 4, 6 పళ్ళ విభాగాలకు 15 నిమిషాలు, జూనియర్, న్యూకేటగిరి విభాగాలకు 20 నిమిషాలు, సీనియర్ విభాగం పోటీలకు గాను 25 నిమిషాలు నిర్ణీత సమయం ఉంటుందన్నారు. కమిటీ వారి నియమ నిబంధనలు ఎద్దుల యజమానులు ఖచ్చితంగా పాటించాలన్నారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు రెడ్ల సత్రం ట్రెజరర్ నెవలి సీతారామిరెడ్డి, పత్తి కోటిరెడ్డి, యర్రెద్దుల శ్రీనివాసరెడ్డి, గోగుల వెంకటేశ్వరరెడ్డి, ఆరికట్ల కాశిరెడ్డి, పేరం వెంకటరామిరెడ్డి, బరువు శ్రీనివాసరెడ్డి, చపారపు భాస్కర్‌రెడ్డి, గాదె వీరారెడ్డి, సిద్ధవటం శివారెడ్డి, లింగిరెడ్డి కోటిరెడ్డి, చింతా శివారెడ్డి, తాతిరెడ్డి రామకృష్ణారెడ్డి, గాదె బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యూటీఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక



మండల ప్రధాన కార్యదర్శి షేక్ అన్వరుల్లా

రెంటచింతల: రెంటచింతల యూటీఫ్ మండల నూతన అధ్యక్షులుగా విజేవి రాజ్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు యూటీఫ్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ ఎంబి చిన్నమ్మ, గుజ్జుల లింగారెడ్డి శనివారం తెలిపారు. రెంటచింతలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యూటీఫ్ రెంటచింతల నూతన కమిటీ ఎన్నికలు నిర్వహించడం జరిగిందన్నారు. మండల అధ్యక్షులుగా విజేవి రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా షేక్ అన్వరుల్లా, ఆర్థిక కార్యదర్శిగా జి.రామాచారి, మహిళా కార్యదర్శిగా ఆదూరి మేరి జోస్పినా, సహా అధ్యక్షులుగా ఓర్సు సాగర్‌బాబు, ఎన్.వి. వసంతకుమారిలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో యుటీఫ్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.